క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డి నగర్‌లోని సర్వే నంబర్ 192లో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతున్న ఇంటి పనులను మండల రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మండల ఎంఆర్‌ఐ తేజ, మోకిల పోలీసుల బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూల్చివేసిన స్థలంలో మళ్లీ కట్టడాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కోటేశ్వరావు, పోలీసులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



సింధును అభినందిస్తున్న యాజమాన్యం

షాద్‌నగర్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు షాద్‌నగర్ పట్టణంలోని మదర్‌థెరిస్సా పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సింధు ఎంపికైంది. హైదరాబాద్ మణికొండలోని చిరాగ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన సింధు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ మత్తయిసామ్ కుట్టి తెలిపారు. విద్యార్థి సింధును పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునయన, ఉపాధ్యాయులు నరేందర్, జ్యోతి, లిజి, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవభావం అలవర్చుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చేగూరులో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద గ్రామానికి చెందిన బంటారం బాల్‌రాజ్ గౌడ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి నవీన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. వినాయకుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు



షాబాద్: మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

కొందుర్గు: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్ బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వానికి అంగన్‌వాడీ గోస వినిపించడం లేదా అని ప్రశ్నించారు. మరోవైపు శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్యకర్తలపై అధికారులతో ఒత్తిడి తేవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొందుర్గులో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, నరేందర్, మల్లేష్‌గౌడ్, అంజిరెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

షాబాద్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మెలో భాగంగా ముంబాయి–బెంగుళూరు లింక్ జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె రాష్ట్రవ్యాప్తంగా 15వ రోజుకు చేరిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఉమా, ప్రవీణా, స్వప్న, కవిత, సరస్వతీ, మంగమ్మ, అనిత, మీనా, సౌభాగ్య, పద్మారాణి, దేవి, చంద్రకళ, హైమావతి, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- పేరుపోయిన చెత్తా చెదారం
- విజృంభిస్తున్న దోమలు
- అధికారుల నిర్లక్ష్యంతో రోగాల బారిన ప్రజలు

శంకర్‌పల్లి: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రతి రోజు చెత్తను శుభ్రం చేయాల్సిన పారిశద్ధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే పేరుకుపోయి పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఫలితంగా తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 15వార్డులు ఉన్నాయి. 14వ వార్డులోని పోలీస్ వసతి గృహాల సముదాయం పరిసరాల్లో చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వస్తుంది. పారిశుద్ధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు సమస్య తీవ్రత ఎక్కువవుతోంది. గణేష్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఓపెన్‌డ్రైన్ ఉండటంతో కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. మురుగు కాల్వ నుంచి వచ్చే దుర్వాసన, దోమలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధి 1వ వార్డులోని క్రిస్టల్ వెంచర్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు పారుతుండటంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం ఎదుట ఉన్న గంతలో నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపై నీరు నిలిచి చిత్తడిగా మారుతోందని వాపోతున్నారు. మరికొన్ని కాలనీల్లో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో విష పురుగులు తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కారించాలని ఆయా కాలనీల ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు శంకర్‌పల్లి మున్సిపాలిటీపై దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలప్రజలు కోరుతున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీగా రూపాంతరం చెందినా పారిశుద్ధ్యం విషయంలో ఎటువంటి మార్పు లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలను రోగాల బారిన నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.



గణేశ్‌నగర్‌లో ఇళ్ల మధ్య ఓపెన్ డ్రైన్



శంకర్‌పల్లిలోని ఎస్సీ బాలికల వసతి గృహం ఎదుట నిలిచిన నీరు



క్రిస్టల్ వెంచర్‌లో ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు

ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కాలనీల్లో చెత్తా, చెదారంతో పాటు మురుగు నీరు రోడ్లపైనే పారుతుంది. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలి.

– జగదీష్, క్రిస్టల్ వెంచర్

చర్యలు తీసుకుంటున్నాం



మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని వార్డుల్లో సమస్యలను గుర్తించాం. త్వరలోనే పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌పల్లి

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: మనిషి చనిపోయిన తర్వాత అవయవదానం చేస్తే ఇంకొకరికి జీవితం ప్రసాదించిన వారమవుతామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిషన్‌నగర్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రంలో అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. మనిషి చనిపోయిన తర్వాత శరీరాన్ని మట్టిలో పూడ్చడమో, కాల్చడమో చేస్తారు. అలా చేయడం వల్ల అవయవాలు ఎందుకు పనికి రాకుండా పోతాయని తెలిపారు. కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడుతాయని అన్నారు. ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి అవయవదానం చేస్తే తిరిగి ప్రాణం పోసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు ఎస్తర్‌రాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



కిషన్‌నగర్‌లో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

ఆధార్ అప్‌డేట్ కష్టాలు

- నమోదు సెంటర్ల వద్ద పడిగాపులు
- పట్టించుకునేవారు లేక అవస్థలు
- మండలానికి ఒక కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్

చేవెళ్ల: ఆధార్ కేంద్రాల సంఖ్య సరిపడ లేకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. సోమవారం చేవెళ్లలోని ఆధార్ సెంటర్లు తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మండల ఎంఈఓ కార్యాలయం వద్ద ఉన్న కేంద్రాలకు ప్రజలు ఒక్కసారిగా రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఎక్కడ ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఉన్న రెండు కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం చేవెళ్లలో ఒక్కటి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద మరొక ఆధార్ కేంద్రం ఉంది. పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని విద్యాశాఖ కార్యాలయంలో కొన్ని రోజుల క్రితం ఏర్పాటు చేశారు. అక్కడ కేవలం విద్యార్థులకే అప్‌డేట్ చేస్తున్నారు. అయితే, విద్యార్థులు తక్కువగా వస్తుండటంతో ప్రజలకు కూడా సేవలు అందిస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా రోజురోజుకూ ప్రజలు తాకిడి పెరగడంతో పోలీసుల వచ్చి అదుపు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని చూసిన ఎంఈఓ అక్బర్ ఇక్కడ విద్యార్థుల కోసమే ఉందని ఇది ఆధార్ కేంద్రం కాదని చెప్పడంతో సోమవారం మధ్యాహ్నం సెంటర్‌ను మూసివేశారు.

పట్టించుకోనేవారే లేరు..

ఆధార్ అప్‌డేట్ కోసం గత కొన్ని నెలలుగా పడిగాపులు తప్పడం లేదు.. ఇతర మండలాల నుంచి చేవెళ్ల మండలకేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నా కేవలం రోజుకు 20 మంది కంటే ఎక్కువగా అప్‌డేట్ కావటం లేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల అప్‌డేట్ చేస్తుండటంతో దీనికి ఆధార్ అప్‌డేట్‌లేని వారివి వేలి ముద్రలు, ఐరీష్‌లు రావటం లేదు. దీంతో ఆధార్ అప్‌డేట్ చేసుకొని రావాలని చెప్పటంతో ఆధార్‌కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం అధికారులు, నాయకులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోరా అన్ని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు

సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, చీరల పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే హాజరై చెక్కులు, చీరల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం, వైద్య, విద్య రంగంలో రాష్ట్రం ముందుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలు పరిష్కారంలో ముందు వరుసలో ఉంటారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను, తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రంజేవంతు, వైస్ ఎంపీపీ మమత, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోర శ్రీనివాస్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, సర్పంచ్‌లు సంధ్యాశ్రీశైలం, జనార్దన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మైభాయ్, ఎంపీటీసీ మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

వినాయకులకు ప్రత్యేక పూజలు

శంకర్‌పల్లి: పట్టణంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసినా వినాయకులకు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని మోత్కులగూడ, వెంకమ్మగూడ, బండోనిగూడ, చేగూరు, తాళ్లగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలో చేశామన్నారు. అన్ని వర్గాల వారిని ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాడని గుర్తుచేశారు. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రతి నెల క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేసి, పట్టణాలతో సమానంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ తదితర కార్యక్రమాలు చేపడుతుండటంతో ప్రతిపక్షపార్టీలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. అలాగే, మోత్కులగూడ, బండోనిగూడ, వెంకమ్మగూడ గ్రామాలకు సంబంధించి 166 యూనిట్ల గొర్రెలను కురుమలకు పంపిణీ చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చేగూరులో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, సర్పంచులు రజనీత, కుమార్, సంతోష, ఎల్లమ్మ, అశోక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్నలత, నాయకులు శ్రీశైలం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: దేశానికి దీన్ దయాళ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ నేత, పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రీయ స్వయంసంఘ్ భావజాలంతో జాతీయ ఐక్యత కోసం పని చేసిన మహనీయుడు దీన్‌దయాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అందెబాబయ్య, ఇస్నాతి శ్రీనివాస్, మల్చలం మురళీ, వెంకటేష్, పాండురంగారెడ్డి, సుభాష్‌రెడ్డి, నర్సింలు, భీమయ్య పాల్గొన్నారు.

నరేంద్రమోదీ సభను జయప్రదం చేద్దాం

కొందుర్గు: మహబూబ్‌నగర్‌లో అక్టోబర్ 1వ తేదీన నిర్వహించే మోడీ సభకు భారీ ఎత్తున ప్రజలను తరలించి జయప్రదం చేయాలని బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. చౌదరిగూడలో నిర్వహించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు దీన్ దయాల్ ఉపాధ్యాయ బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మయ్య, సురేష్, నర్సింలు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఆరు గ్యారెంటీ' పథకాలు



కొత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్

కొత్తూరు: కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను అస్త్రాలుగా చేసుకొని బీజేపీ, బీఆర్‌ఎస్‌పై యుద్ధానికి సిద్ధమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్ అన్నారు. సోమవారం శంకర్ ఆరు గ్యారెంటీ పథకాలతో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. అంతకు ముందు శంకర్ రామేశ్వరం, చౌడమ్మగుట్ట ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సిద్దాపూర్‌లో ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను ఇంటింటికి అందజేస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న దుర్మార్గమైన పాలనను అంతమొందించేందుకు ఆరు పథకాలను అస్త్రాలుగా బయటకు తీసిందన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, యాదయ్య యాదవ్, అందెమోహన్, ముబారక్‌అలీ, ఖదీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలపై ర్యాలీ

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తామని కాంగ్రెస్ నాయకులు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలి రాజు, నాయకులు నరేందర్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సబ్బండవర్గాలు అభివృద్ధి జరుగుతోందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, వేములనర్వ, చింతకుంటపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఆరు గ్యారెంటీ' పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, మల్లేష్‌గౌడ్, మనోహర్‌గౌడ్, గిరియాదవ్, రూప్లానాయక్, మహేష్, ఎల్లయ్య, అనంద్, గణేష్, నర్సింలు, అనంద్‌రెడ్డి, యాదయ్య, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ పథకాలు..

నందిగామ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని నందిగామ ఎంపీటీసీ సభ్యుడు దేవల్లికుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని చేగూరులో సోమవారం ఎస్సీసెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మీసాల శ్రీను ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, శివ,సుధాకర్, రాజ శేఖర్, మహేష్, శంకర్, శ్రీను, నర్సింహా, అరవింద్, బాల్‌రాజ్, సురేష్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కొత్తూరు: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు 24న సిద్దిపేట పట్టణంలో షోటోకాన్ కరాటే నిర్వాహకులు ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పైరింగ్, కటాస్‌తో పాటు పలు విభాగాల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులు తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు వివరించారు.

◆ బహుమతుల అందజేత

షాబాద్: కరాటే పోటీల్లో షాబాద్ విద్యార్థులు ప్రతిభ చాటారని మాస్టర్ నర్సింహులు, ధ్యానహిత పాఠశాల ప్రిన్సిపాల్ సుశాంత్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ధ్యానహిత పాఠశాలల్లో విద్యార్థులకు 21వ నేషనల్ ఓపెన్ కరాటే, ఛాంపియన్ షిప్ 2023కు గాను ధ్యానహిత పాఠశాలల్లో దరాస్, ప్రశాంత్, ప్రవీణ్‌లకు మాస్టర్ నర్సింహులు సుమన్ చిల్డ్రన్ చోట కాన్ కరాటే అసోసియేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరాటే పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచాలన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కరాటే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ధ్యానహిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

◆ మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

మొయినాబాద్‌రూరల్: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నక్కలపల్లి సర్పంచ్ స్వప్న , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి చెరువులో ప్రభుత్వం ద్వారా వచ్చిన చేప పిల్లలను మత్స్యకారులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేప పిల్లలతో మత్స్య సంపద పెరుగుతుందన్నారు. చేపల ఎగుమతి చేసేస్థాయికి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మత్స్యకారులకు చెరువులు, కుంటలే ఉపాధిఅన్నారు. కార్యక్రమంలో అంజయ్యగౌడ్, నిరంజన్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ గణనాథుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మొయినాబాద్: మొయినాబాద్‌లోని శివానగర్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలను అందరు భక్తి శ్రద్ధలతో ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, కాలనీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సామ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, మహరాజ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమావేశాన్ని విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని ఏవీ కన్వెన్షన్ హాలులో ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్లనర్సింహ్మా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అక్టోబర్ 4న అలంపూర్ నుంచి పాదయాత్ర చేపట్టనున్నారని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ, ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ సాధనకు తీసుకోవాల్సిన నిర్ణయాల కోసం ఈ పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎంఎస్, ఎంఎల్ఎఫ్, ఎంజెఎఫ్, ఎంకెఎం, ఎంవైఎస్‌తో పాటుగా అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అనంతయ్య, రవికుమార్, ఆనంద్, శ్రవణ్‌కుమార్, అశోక్, పాండు, వినోద్, లక్ష్మయ్య, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ కనీస వేతనం ఇవ్వాలి

చేవెళ్ల: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశలకు నెలకు రూ.18వేల కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆశ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆశలకు ప్రతి నెల రూ.18వేల ఫిక్సిడ్ వేతనం , ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగభద్రత, రూ.5లక్షల ప్రమాదబీమా సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలు ఎనలేనివని చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆశకార్యకర్తలు సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల చేవెళ్ల మండల అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి మాధవి, ఆశలు లలిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

◆ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

కొత్తూరు: పరిశ్రమల నిర్వాహకులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. సోమవారం రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థ నిర్వాహకుల సహకారంతో కొత్తూరు ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఆమె ప్రారంభించారు. అనంతరం చైర్‌పర్సన్‌తో పాటు పలువురు నాయకులు సంస్థ ప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. విద్యతోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని చైర్‌పర్సన్ వివరించారు. అలాంటి విద్యాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలన్నారు. విద్యార్థులు సైతం తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, లక్ష్మయ్య, శ్రావన్, సంస్థ ప్రతినిధులు పంకజ్‌రోష్ని, ధీరజ్, అశోక్, విదిషా అగర్వాల్, వరుణ్, పూనమ్, భావన, కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.